

కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 19వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఆశలు ఆవిరి..

- **పీఎస్‌ఎల్వీ సీ61 మిషన్ విఫలం..**
- **మూడవ దశలో సాంకేతిక లోపం..**



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో


ఇస్రో 2025లో తన వందో ప్రయోగాన్ని విజయవంతం చేసి సక్సెస్ జర్నీ కొనసాగించింది. ఇదే ఉత్సాహంతో దేశభద్రతకు కీలకమైన శాటిలైట్ ప్రయోగంతో 101వ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. ఆదివారం తిరుపతి జిల్లాలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 5.59 గంటలకి నింగిలోకి ఎగిరిన పీఎస్‌ఎల్‌వీ-సీ61 ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు.

పీఎస్‌ఎల్‌వీ రాకెట్ సాయంతో ఈఓఎస్ 09 శాటిలైట్‌ను భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులో సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఇందుకోసం ఈ రాకెట్ 17 నిమిషాల 39 సెకన్ల పాటు నాలుగు దశల్లో రాకెట్ ప్రయాణించాల్సి ఉంది. మొదటి, రెండు దశల వరకు దీని ప్రయాణం సాఫీగానే సాగింది. కానీ మూడో దశలోనే సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ నిర్దేశిత మార్గంలో కాకుండా మరో మార్గంలో ప్రయాణించడం మొదలు పెట్టింది. ఇందులో లోపం ఎక్కడ తలెత్తిందన్న వివరాలను విశ్లేషణ తర్వాత వెల్లడిస్తామని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.

కీలమైన సమాచారం అందించే శాటిలైట్

భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఇస్రో తన 101వ ప్రయోగం చేపట్టింది. నిజానికి ఇస్రో ప్రయోగానికి, ఇప్పుడున్న ఉద్రిక్త పరిస్థితులకు ఒక సంబంధం ఉంది. ఇస్రో గతంలో ప్రయోగించిన శాటిలైట్లు కొన్ని రక్షణ రంగానికి కీలకమైన సమాచారం అందించాయి. ఆ కోవలోనిదే ఇప్పుడు ప్రయోగించిన ఈఓఎస్ 09 కూడా. దీనిని ఒక గూఢచార శాటిలైట్‌గా పలు మీడియా సంస్థలు చెప్పుకొచ్చాయి. ఇది భారతదేశానికి నిఘా నేత్రం లాంటిదని చెప్పవచ్చు. ఇప్పటి వరకూ భారత రక్షణ రంగానికి వెన్నుదన్నుగా ఉండేందుకు ఈఓఎస్ 04 వంటి శాటిలైట్లను ప్రయోగించిన ఇస్రో.. ఇప్పుడు ఈ సీరిస్‌లోనేఈఓఎస్ 09ను ప్రయోగించింది. ఇది రిమోట్ సెన్సింగ్ డేటాను అందిస్తుంది. గతంలో భారత సైన్యం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్ వంటి సమయాల్లో కార్టోశాట్ వంటి ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్లు ఇచ్చిన డేటానే ఆధారం చేసుకున్నాయని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ బీబీసీకి తెలిపారు. అయితే కార్టోశాట్ వంటి ఉపగ్రహాలు పంపే డేటాకు కొన్ని పరిమితులున్నాయి. అంటే ఈ శాటిలైట్లు రాత్రి పూట చిత్రాలను తీయలేవు. వాతావరణం సరిగాలేని సందర్భాలు అంటే మేఘావృతంగా ఉన్నప్పుడు, దట్టమైన పొగమంచు అలముకున్నప్పుడు తదితర సందర్భాల్లో స్పష్టమైన చిత్రాలను అందించలేవు. అందుకే ఇలాంటి ప్రతికూల సందర్భాల్లోనూ కీలక డేటా అందించేందుకు ఈఓఎస్ 09 వంటి శాటిలైట్లు అవసరం.

ఈ నేపథ్యంలోనే రీశాట్ -1బీ ఉపగ్రహంలో అమర్చిన సీ- బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్) ప్రత్యేకతంగా రూపొందించారు. ఈ రాడార్ సహాయంతో పగలు, రాత్రి ఎలాంటి వాతావరణ పరిస్థితులైన భూ ఉపరితలాన్ని హై రిజల్యూషన్ తీసి పంపగలదు, భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత్ సైనిక దళాలకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యి ఉంటే దేశభద్రత, సైనిక అవసరాలకు అవసరమైన సమాచారాన్ని అందించడంలో రీశాట్ -1బీ కీలకంగా ఉండేది. ఉగ్రవాదుల స్థావరాలు, వారి కదలికలను పసిగట్టడంతో పాటు, సరిహద్దు ప్రాంతాల్లో శత్రువుల బలగాలాలను సంబంధించిన కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించి హై రిజల్యూషన్ ఫోటోలు పంపి ఉండేది..



వాల్టా చట్టానికి తూట్లు..

- **చెట్లు నరికేస్తున్న చూడరు...**
- **ట్రాక్టర్‌లో తరలిస్తున్న అడగరు..**
- **పట్టించుకోని అధికారులు**

పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతోంది. వృక్ష సంపద రోజురోజుకి కనుమరుగవుతోంది. మానవాళికి పెనుప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం విరివిగా మొక్కలు నాటాలని అనేక కసరత్తులు చేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం వందల సంవత్సరాల వృక్షాలను నేలకూలుస్తున్నారు. మండలంలో వోల్టా చట్టం కాస్త ఉల్టాగా మారుతుంది.

ప్రజాశక్తి- పూతలపట్టు:

గత చరిత్ర తీసుకుంటే రాజుల కాలం నుంచి వృక్ష సంపదకు అధిక ప్రాముఖ్యత ఇచ్చారు. రాజుల కాలంలోని రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వృక్ష సంపదను పెంచారు. కానీ నేడు 100 సంవత్సరాలు గల వృక్షాలను సైతం నేలకూలుస్తున్న అధికారులు మాత్రం పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కర్మాగారాలకు



కలప అక్రమ రవాణా జరుగుతున్న అటవీశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ వ్యాపారులు ఆగడాలు మితిమీరాయి. పూతలపట్టు మండల పరిధిలో అక్రమ కలప రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చెట్లను నేలకూల్చి ట్రాక్టర్ల ద్వారా కర్మగారాలకు తరలిస్తున్నారు. పెద్ద సైజులను ఒకచోట పోగు చేసుకుని గృహ నిర్మాణాల కోసం అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ఇదంతా అటవీ శాఖ అధికారులకు కనుసన్నల్లోనే జరుగుతోందని స్థానికులు బహిరంగగానే చెబుతున్నారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేసి పాల డెయిరీలు, జ్యూస్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు.



రాత్రికిరాత్రి తరలిపోతున్న కలప

నామమాత్రపు దాడులు..

పూతలపట్టు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అటవీ ప్రాంతం నుంచి కలప తరలిపోతుంది. స్థానికులు అటవీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు నామమాత్రం దాడులు నిర్వహించి ఒకటి రెండు వాహనాలను సీజ్ చేస్తున్నారు. పట్టుమని మూడు రోజులు కాకుండానే వ్యాపారులు మళ్ళీ విజృంభిస్తున్నారు. మారుజాతి చెట్లతోపాటు విలువైన టేకు కలప సైతం తరలిపోతోంది. రైతులకు చెందిన పట్టా సర్వే నెంబర్లు పేరుతో పక్కనే ఉన్న రక్షిత నీటి ప్రాంతాలలో ఉన్న చెట్లను నరికి తరలించకపోతున్నారు.

21న డీఈవో ఆఫీస్ ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి చేసిన చట్టంలోని అసంబద్ధతలను, పాఠశాల పునర్వ్యవస్థకు సంబంధించిన నిబంధనలను సవరించాలని కోరుతూ ఈనెల 21న చిత్తూరు డిఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం చిత్తూరులోని ఎన్జీవో హోంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.బాలాజీ, ఏఎం.గిరి ప్రసాద్‌రెడ్డి, జీవీ రమణల అధ్యక్షతన సమావేశమైన ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ ఆ మేరకు తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయమని రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం జీవో రద్దు పేరుతో గతంలో ఆరుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఉన్న భౌతిక, సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలలను పునర్వ్యవస్థీకరించడం జరిగిందని, దీనిద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా వచ్చాయని పేర్కొన్నారు. దాంతో పాటు మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడెల్ స్కూల్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతో పాటు, చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలకు చేరుకోవడం కష్టమవుతుందని, దీనిని సవరించాలని కోరారు. బదిలీ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉందని దుయ్యబట్టారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల కేటాయింపుకు సంబంధించి విభిన్న పద్ధతులు అవలంబించారని, వాటిని సరిదిద్దాలని, మోడల్ పాఠశాలకు ఇస్తామంటున్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎస్జీటీ నుండి పదోన్నతులు కల్పించి ఇవ్వాలని, హైస్కూల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని సవరించి 46 మంది విద్యార్థులకు రెండో సెక్షన్ వచ్చే విధంగా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21న జరిగే చిత్తూరు డిఈఓ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు చంగల్రాయ మందడి, మదనమోహన్ రెడ్డి, రహ్మద్ మునాఫ్, ముత్యాల రెడ్డి, మణిగండన్, మునీర్ అహమ్మద్, కెఎస్.కన్నన్, దొడ్డ ఉమామహేశ్వర్, కిరణ్ కుమార్, చిట్టిబాబు, గోవిందస్వామి, విజయ్ భాస్కర్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మంజునాథ్ గుప్తా, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.



టమాటా రైతు కంట కన్నీరు

- **పశువులు పాలైన పంట**

ప్రజాశక్తి- పుంగనూరు

ఆరుగాలం కష్టపడి పండించిన టమాటా పంట గిట్టుబాట ధర లేక పశువులు పాలవుతుంటే రైతు కంట కన్నీరే మిగిలింది. టమాటా ఎకరా పంట సాగు చేసేందుకు లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది టమాటా ధరలు తక్కువగా ఉండడంతో రైతులు భారీగా నష్టాలు చూడాల్సి వచ్చింది.



పశువులకు మేతగా మారిన టమాటాలు

టమాటా పంట పండించేందుకు ఒక ఎకరా పొలం దున్నడానికి ట్రాక్టర్‌కు రూ.15వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఎకరా సాగు చేసేందుకు ఏడు వేలు నుండి 12వేలు మొలకలు అవసరం. ఒక్కో మొలక నర్సరీలలో రూ.2 నుంచి 4ల వరకు చెల్లించి రైతు టమాటా మొలకలను తీసుకొస్తారు. ఇక ఫర్టిలైజర్స్, మల్చింగ్ పేపర్, యూరియా, పురి, తంగస్ దారం, వైరు, కట్టెలు ఖర్చులు కలిపి ఒక ఎకరం టమాటా పంట సాగు చేసేందుకు రైతుకు రూ.1.50 లక్షల నుండి 2.50లక్షల వరకు ఖర్చు అవుతోంది. వీటన్నింటినీ భరించి చివరికి టమాట కోతకొచ్చినప్పుడు వాటిని కోసి మార్కెట్‌కు తరలించేందుకు కూలీలు కూడా అధికంగా ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పెట్టుబడి కోసం రైతులు బంగారు నగలు సైతం తాకట్టు పెట్టి మరీ సాగు చేస్తున్నారు.

గత ఏడాది టమాటా సాగు చేసిన రైతులు మంచి లాభాలు చూశారు, దీంతో అధిక మొత్తం రైతులు టమాటా పంటను సాగు చేశారు. అయితే ఈ సంవత్సరం టమాటా పంట సాగు చేసి రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు మార్కెట్‌కు తీసుకుని రాకుండానే వ్యవసాయ పొలంలో పశువులకు మేతగా పారబోస్తున్నారు. గత ఏడాది 10 కేజీల బాక్స్ రూ.600 నుండి 900 వరకు ధర పలికింది. ఈ ఏడాది దీనిని దృష్టిలో ఉంచుకొని టమాట పంట సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెరగడం, ఎగుమతి తగ్గడం ధర లేకపోవడం వంటి సమస్యలతో టమాటా రైతు భారీ నష్టం ఎదుర్కోవాల్సి వస్తుంది.



గత ఏడాది పుంగనూరు మండలంలో 2200 ఎకరాలు టమాటా పంట సాగు చేస్తే ఈ ఏడాది 3200 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ఇక పుంగనూరు మార్కెట్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని మధురై, తిరుచి, పేని, చెన్నై, ఈరోడ్, తిరునామలైతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు నిత్యం 1000 టన్నుల వరకు టమాటా ఎగుమతి చేస్తారు. బయట ప్రాంతాలలో కూడా టమాటా సాగు ఎక్కువగా ఉండడంతో మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. రెండు వారాలుగా నాణ్యమైన టమాట కిలో ఐదు రూపాయలు పలుకుతుండగా నాణ్యత లేని రెండో రకం టమోటా కిలో రూ 2.75లు జూసుకు వెళ్లే టమోటో రెండు రూపాయలు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఉన్న పంటని ఏమీ చేసుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్నారు రైతులు.

ఉపాధిలో అవినీతికి చెక్..

- **మరింత పక్కాగా పనులు**
- **జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా యుక్తధార యాప్..**
- **ప్రతి మండలానికి ఒక గ్రామపంచాయతీ ఎంపిక...**
- **పనుల ప్రణాళిక మంజూరుకు కొత్తగా యాప్**
- **ఇస్రో నేషనల్ రిమోట్ పెన్సిల్ సెంటర్‌తో యాప్ అనుసంధానం**

ప్రజాశక్తి- యాదమరి:

చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో ప్రతి మండలంలో ఒక పంచాయతీ చొప్పున ఇప్పటికే యుక్తధార యాప్ ద్వారా పనులు ఎంపికను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టి అమలు చేస్తున్నది. ఇది పూర్తిస్థాయిలో విజయవంతం అయితే అన్ని గ్రామ పంచాయతీల్లో అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఉపాధి హామీ చట్టం అమలులో పనులు పారదర్శకత, పనుల్లో దుర్వినియోగానికి తావు లేకుండా పలు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్న కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ తాజాగా ఉపాధి పనుల ప్లానింగ్ మంజూరులో సైతం మార్పులు తెచ్చింది. ఇందుకోసం యుక్తధార పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో అనుసంధానం చేసింది. తద్వారా ఈ పనులను తన నియంతంలోకి తీసుకుంటుంది. ఈ విధానం వల్ల ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చాలా వరకు తగ్గిపోతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటివరకు రాష్ట్రాల అజమాయిసులో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిర్వహణ పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనుంది. ఇకపై పనుల కల్పన అంచనాల ప్రక్రియను కేంద్రమే పర్యవేక్షణ చేయనుంది. ఇందులో భాగంగానే నూతన మొబైల్ యాప్ తీసుకొచ్చింది. ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తన నియంత్రణకి తీసుకునేందుకు కేంద్రం యుక్తధార అనే కొత్త యాప్ తీసుకొచ్చింది. ఇప్పటివరకు రాష్ట్రాల ఆధ్వర్యంలో కొనసాగిన పనుల నిర్వహణను ఇకపై కేంద్రమే పర్యవేక్షించనుంది. ఉపాధి పనుల ఎంపిక, అంచనాల బిల్లుల చెల్లింపులు వరకు అన్ని యాప్ ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



26 జిల్లాల నుండి హాజరైన ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న పీడీ

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా...

చిత్తూరు జిల్లాలో యుక్తధార యాప్ ద్వారా ప్రతి మండలానికి ఒక గ్రామపంచాయతీని ఎంపిక చేసుకొని ఈ యాప్‌తోనే ఏ ప్రాంతంలో ఏ పనులు చేపట్టాలని గుర్తిస్తారు. ఒకసారి ఏడాది ప్లానింగ్ పూర్తయ్యాక ఆ పనులకే పరిమితం. ఈ పంచాయతీల్లో ఈ యాప్ ద్వారా పనులు పారదర్శకత, ఒకసారి పనులు చేపడితే మరోసారి ఆ ప్రాంతాల్లో అవే పనులు చేసే అవకాశం ఉండదు. ఈ విధానం వల్ల ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చాలావరకు తగ్గిపోతాయని అధికారులు చెబుతున్నారు.

పనుల గుర్తింపు కూడా సాంకేతికతతోనే...

ఒక ప్రాంతంలో చేపట్టడానికి అవకాశం లేని పనులను ప్రణాళికలో చేర్చే అవకాశం యుక్త ధర యాప్‌లో ఉండదని అధికారులు చెబుతున్నారు. ఈ యాప్ పూర్తిగా ఇస్రో ఆధ్వర్యంలో సమగ్ర గూగుల్ మ్యాప్‌కు అనుసంధానమై ఉండటం వల్ల చెరువులు ఉన్న ప్రాంతాల్లోనే వాటి పూడిక తీత పనులు చేపట్టే వీలు ఉంటుంది. కొన్ని రకాల పనులకు ఆ ప్రాంత భూగర్భ పరిస్థితులు అనుకూలమా లేదా అన్నది కూడా పనినిర్ధారణ సమయంలోనే తేలిపోతుంది. తద్వారా పనుల గుర్తింపులు అక్రమాలకు తెరపడుతుందని పలువురు అధికారులు చెబుతున్నారు.

దొంగ మస్టర్‌కు చెక్..

ఉపాధి హామీలో దొంగ మస్టర్‌లకు కేంద్రం చెక్ పెట్టబోతుంది. దీని ప్రకారం ఒక ప్రదేశంలో కూలీలు పని చేసే సమయంలో రోజు ఉపాధి హామీ పథకం సిబ్బంది ఫోటో తీయాలి, ఆ ఫోటోలో ఉన్న కూలీల సంఖ్య అక్కడ పనికి హాజరైనట్టు సిబ్బంది మస్టర్ షీట్‌లో నమోదు చేసి కూలీల సంఖ్య ఒకటిగా ఉంటేనే ఆరోజు వేతనాలు చెల్లింపులు జరుగుతుంది. ఫోటోలో మస్టర్ షీట్లో సంఖ్యలు తేడా ఉంటే ఆ మస్టర్ సీటును పరిగణనలోకి కూడా తీసుకోరు.

ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో నుసంధానం

ప్రస్తుతం ఈ పథకం పనుల ప్రణాళిక ఆఫ్‌లైన్ విధానం రూపొందించి ఎంతోమంది పేదలకు పనులు కల్పిస్తారు. కూలీల సంఖ్య మాత్రమే గ్రామీణ విద్యశాఖ ఉపాధి హామీ చట్టం పోర్టల్లో నమోదు చేస్తున్నారు. ఈ పనుల నంబర్లను పోర్టల్‌లో ఎంటర్ చేసి వాటి బిల్లులు పెడుతున్నారు. కొత్త విధానంలో మొబైల్ యాప్ ద్వారా ప్రణాళిక పూర్తిగా ఆన్‌లైన్‌ను రూపొందుతుంది. ఏ పంచాయతీలో ఏ రకమైన పనిని ఏ ప్రదేశంలో చేపడుతారో గూగుల్ మ్యాప్‌లో గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు. ఈ యాప్ పూర్తిగా ఇస్రో నేషనల్ రిమోట్ సెంట్రింగ్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇలా అన్ని పనులు జియో టాకింగ్ చేసి మ్యాప్‌లోనే ఒక్కో పనికి ఒక్కో నంబర్‌ను కేటాయిస్తారు. ప్రతి పనికి అంచనా విలువలు సైతం యాప్‌లోనే నమోదు చేస్తారు. ఏ పనికి బిల్లులు పెట్టాలన్న పోర్టల్‌లో ఎంటర్ చేసి వాటికి బిల్లు పెడుతున్నారు. కొత్త విధానంలో మొబైల్ యాప్ ద్వారా ప్రణాళిక పూర్తిగా ఆన్లైన్లో రూపొందుతుంది ఏ పంచాయతీలో ఏ రకమైన పనిని ఏ ప్రదేశంలో చేపడుతారో గూగుల్ మ్యాప్‌లో గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు. ఏ పనికి బిల్లులు పెట్టాలన్న యాప్‌లో నమోదు చేసిన ప్రకారం వర్క్ ఐడీలను ఎంపిక చేసుకుని బిల్లులు పెట్టాలి.




యుక్త ధార యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఉపాధి హామీ పీడీ రవికుమార్ (ఫైల్ ఫోటో)

వచ్చే ఏడాది నుంచి అన్ని గ్రామాల్లో అమలు...

ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం డేటా పంచాయతీల వారీగా ఉపాధి హామీ పథకం పనుల కల్పనా ప్రణాళిక రూపకల్పన ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే అక్టోబరు, ఫిబ్రవరి నెల మధ్య సమావేశాలు నిర్వహించి వాటికి లేబర్ బడ్జెట్ పేరుతో ఆమోదం తెలిపేది. కొత్తగా గుర్తించిన పనులను గ్రామపంచాయతీ లేదా మండల జిల్లా పరిషత్తులో తీర్మానం అనంతరం మంజూరు చేసేవారు. కేంద్రం తెచ్చిన కొత్త విధానం ప్రకారం ఇకపై ఆర్థిక సంవత్సరం మొత్తానికి కేంద్రం ఒకేసారి ఆ రాష్ట్రాల్లో గ్రామ పంచాయతీల వారీగా లేబర్ బడ్జెట్ను ఆమోదం తెలుపుతుంది. ఏడాది మధ్యలో పనుల మంజూరు కావు. ఇలా ఏడాది ప్రణాళిక రూపకల్పనకు యుక్త ధార మొబైల్ యాప్ ప్రవేశపెట్టింది.

నీటి కుంటలో పడి

ముగ్గురు చిన్నారులు మృతి


నీటికుంటలో పడి మృతి చెందిన చిన్నారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ప్రమాదవశాత్తు ముగ్గురు చిన్నారులు నీటి గుంటలోపడి ప్రాణాలు కోల్పోయిన ఘటన కుప్పం మండలం దేవరాజపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం మండలం దేవరాజపురంలో ఇంటి నిర్మాణం కోసం తీసిన పునాది గుంటలో వర్షం కారణంగా నీరు చేరాయి. వేసవి సెలవులు కావడంతో ఆదివారం ఇదే గ్రామానికి చెందిన తిరుపతి, వరలక్ష్మిల కుమార్తె గౌతమి (7), రాజ, సుమతిల కుమార్తె శాలిని (5), శరవణ, యశోదల కుమారుడు అశ్విన్ (6) ఆడుకుంటూ అటువైపు వెళ్లి నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



చిన్నారులను బలిగొన్న నీటి కుంట

పోక్సో కేసులో ముద్దాయికి రిమాండ్

ప్రజాశక్తి- చౌడేపల్లి: ఎస్సీ ఎస్టీ పోక్సో కేసులో ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మండలంలోని ఆమిల్గుంట పంచాయతీకి చెందిన నాగేంద్ర ఓ బాలికను మోసపూరిత మాటలు చెప్పి గర్భవతిని చేశాడని బాలిక తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ పోక్సో కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసి పుంగనూరు కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు. న్యాయమూర్తి తీర్పుతో సదరు ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈకేసులో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్సై నాగేశ్వరరావు సహకరించారని డీఎస్పీ తెలిపారు.



సోమలలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సోమలలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి -సోమల: 'సైన్యానికి మేము అండగా ఉంటాం..' అంటూ మద్దతుగా మండల కేంద్రమైన సోమలలో కూటమి నాయకులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో భారత్ సైన్యానికి తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గన్నా మదన్మోహన్ బాబు, శంకర శ్రావణ్ , వైస్ ఎంపీపీ ప్రభాకర్, వరదం వెంకటరమణ, జ్యోతిశ్వరుడు, వి వెంకటరమణ, గ్రామస్తులు పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయం

ప్రజాశక్తి -వికోట : స్థానిక శాఖా గ్రంథాలయం వేసవి సెలవు లలో విద్యార్థులకు అందుబాటులో వుంటుం దని స్థానిక శాఖా గ్రంథాలయాధి కారి తెలిపారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థులకు వేసవి సెలవులలో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ తరగతుల్లో విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయుల వద్ద అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణలో కథల పుస్తకాల పఠనం, సాధారణ జ్ఞానం (జికె), స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డ్రాయింగ్, ఆటల పోటీలు వంటి పలు అంశాలు నిపుణుల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను అభివృద్ధి చేయడమే ఈ తరగతుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సిబ్బంది వహబ్ కోరారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మ గారి పల్లి, పేటూరు పంచాయతీలలో ఆదివారం నిర్వహించిన టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.


గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పెద్ద ఉప్పరపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సి రెడ్డప్ప నాయుడు, సెక్రటరీగా బి వెంకటేష్, అన్నెమ్మ గారి పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా బంగారు బాబు, సెక్రటరీగా సుబ్రమణ్యం నాయుడు, పేటూరు గ్రామ కమిటీ అధ్యక్షులుగా బాలాజీ నాయుడు సెక్రటరీగా పవన్ కళ్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమాపతి నాయుడు, మూడు పంచాయతీల పరిధిలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చిత్తూరు రూరల్ మండలంలో టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు పి. సునీల్ కుమార్, ఉన్నం మారుతి పర్యవేక్షణలో చిత్తూరు రూరల్ పరిధిలో కుర్చివేడు, తాళంబేడు, చింతలగుంట, దిగువమాసాపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పంచాయతీ ఇన్చార్జులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో సహా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, మండల కన్వీనర్ శశికర్ బాబు, కార్యదర్శి రఘు, మాజీ ఎంపీపీ జయచంద్రనాయుడు జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మాజీ సర్పంచు లు, మాజీ ఎంపిటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని అంబోదరపల్లి పంచాయతీ శెట్టి రామాపురంలో గంగమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం బెంగళూరులో నివసిస్తున్న ఆంధ్ర రాష్ట్రానికి చెందిన గ్రామస్తులు, వారి బంధువులు అంగరంగ వైభవంగా గంగమ్మకు పూజలు చేయడం ఆనవాయతీ. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి పూజల నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ రెడ్డి, జయచంద్రారెడ్డి, వెంకటేసుల రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాధితులు

పాడి ఆవులు అపహరణ

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపల్ పరిధిలోని బేరిపల్లిలో 2 లక్షల రూపాయలు విలువ చేసే రెండు పాడిఆవులు శనివారం అర్ధ రాత్రి అపహరణకు గురైనట్లు ఆదివారం ఉదయం పలమనేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బేరిపల్లిలోని రెడ్డమ్మకు చెందిన ఒక లక్ష ఇరవై వేల రూపాయలు విలువ చేసే పాడి ఆవును, అదే ఊర్లో దీపిక కు చెందిన లక్ష రూపాయల విలువ చేసే పాడి ఆవును గుర్తు తెలియని దొంగలు తీసుకెళ్లినట్లుగా గుర్తించి, చుట్టుపక్కలా గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసి నట్లు తెలిపారు పోలీసులు సీసీ కెమెరాలు వెతుకుతూ దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే పాడి ఆవుల దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

సచివాలయాల్లో కానరాని ఉద్యోగులు

- సమయ పాలన కరువు
- కొన్ని చోట్ల రెండు, మూడు రోజులైనా తెరవని సచివాలయాలు
- ప్రజలకు అందని సేవలు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి అర్బన్ పరిధిలో స్థానికంగా అన్ని రకాల పౌరసేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. మా సేవలు అటుంచితే అసలు ఉద్యోగులు విధులకు హాజరు కావడమే గగనంగా కనిపిస్తోంది. సమ యపాలన అసలు పాటించడం లేదు. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత కాని కార్యాలయాలకు రావడం లేదు. మధ్యాహ్నం 1 గంట తర్వాత ఎవరూ ఉండటం లేదు. కొన్ని చోట్ల వారానికి రెండు, మూడు సార్లు కూడా తెరుచుకోవడం లేదు. దీంతో పలు పనుల కోసం వచ్చిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది.



మూసివేసి వున్న కెవిపిఆర్‌పేట సచివాలయం

నగరి అర్బన్, నగరి మున్సిపాల్టీ పరిధిలోని కెవిపిఆర్‌పేట, రామానాయుడు కాలనీ సచివాలయంలో అధికారుల విధులకు గైర్హాజరై నామమాత్రంగా ఎఫ్ఆర్ఎస్ పెడుతూ తమ సొంత పనులు నిమిత్తంగా వెళ్లిపోవడం నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయం పనులు కోసం వస్తున్న ప్రజలు వార్డు సచివాలయం మూసివేయడంతో నిరాశతో వెను తిరుగుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఒక్కో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్, అగ్రికల్చర్, ఎనర్జీ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, సర్వేయర్, మహిళా పోలీసు ఉంటారు. వార్డు గ్రామ సచివాలయాలతో పాటు మండల కేంద్రాల్లోనూ ఒకరిద్దరికి మించి సిబ్బంది కనిపించడం లేదు. హాజరు పట్టికలో సంతకాలు మాత్రం ఉంటున్నాయి. ప్రశ్నిస్తే ఫీల్డ్‌లో ఉన్నారంటూ సమాధానమిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం పది గంటలకు అన్ని శాఖల సిబ్బంది సచివాలయానికి వచ్చి హాజరు పట్టికలో నమోదు చేసుకోవాలి. ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం వస్తే ఎక్కడికి, ఏ పని నిమిత్తం వెళుతున్నారో మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. కొందరు ఉద్యోగులు అవేమి చేయడం లేదు. సచివాలయం స్థాయిలో వీరంతా అడ్మిన్, మండ ల స్థాయిలో ఎంపీడీవో లు మున్సిపాలిటీలో కమిష నర్ పర్యవేక్షిం చాలి. అధికారుల పర్య వేక్షణ లోపంతో ఉద్యోగు లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తు న్నార ని స్థానికుల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాల ఉద్యోగు లు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుని ప్రజలకు అన్ని సేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రహరీ గోడ దాటి పక్కకి ఒరిగిన ఆర్‌టిసి బస్

పక్కకి ఒరిగిన ఆర్‌టిసి బస్

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -వి కోట : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్‌టిసి బస్సు పక్కకి ఒరిగి పోయింది. ఈ ప్రమాదంలో ప్రయా ణి కులకు ఎలాంటి ముప్పు ఎదురుకాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పలమనేరు డిపోకు చెందిన ఆర్డినరీ ఆర్‌టిసి బస్సు ఆదివారం బస్టాండ్ ప్రాంగణంలో నుండి తిరుగు ప్రయాణంలో వెనుక వెళుతూ కాంపౌండ్ ప్రహరీ గోడను దాటి ప్రమాదవశాత్తు వెనక్కి ఒరిగి పోయింది. ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ప్రయాణి కులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వీకోట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం గుంతలమయం కావడంతో బురద మయమైంది. దీంతో బస్టాండ్ ప్రహరీ కోసం నిర్మించిన గోడ పూర్తిగా నాని పోవడంతో పాటు ప్రహరీ గోడ భూమి మట్టానికి ఉండడంతో ఆర్‌టిసి బస్సు వెనకకు వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందకి జారి పోయింది. సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌టిసి ప్రహరీ గోడను కొంతమేర ఎత్తుకు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారమ్మ ఆలయంలో తులాభారం

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరంలోని బంగారమ్మ దేవస్థానంలో వెతుకుప్పం వాస్తవి, ధనమ్మ మనవడు కౌశిక్ రెడ్డికి ఆదివారం తులాభారం నిర్వహిం చారు. ఈ తులా భారం ద్వారా దేవస్థానానికి రూ.2,501లు


చిన్నారికి తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

చిరంజీవి కౌశిక్ రెడ్డి తల్లిదండ్రులు పవిత్ర, నారాయణ రెడ్డి అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ నగదును దేవాలయ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు దేవస్థానం అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కే ప్రసాద్, కమిటీ సభ్యుల రంగనాథ మొదలియార్, చంద్రశేఖర్, రామిశెట్టి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజు పల్లి పంచాయతీ సర్పంచ్ స్వర్ణమ్మ, వార్డు సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు వైసిపిని వీడి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమక్షంలో


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన సర్పంచ్, వార్డు సభ్యులు

టిడిపిలో ఆదివారం చేరారు. టిడిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అండతో అమ్మరాజు పల్లి పంచాయతీని అభివృద్ధి చేస్తానని సర్పంచ్ స్వర్ణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఎగురవేసిన అనంతరం రెడ్డెప్ప, లక్ష్మమ్మ, కస్తూరమ్మ, శాంతమ్మ లతో పాటు గ్రామానికి చెందిన గంగిరెడ్డి, సుబ్బా రెడ్డి, తలారి రెడ్డెప్ప, రాజారెడ్డి, రమేష్ రెడ్డి, మునిరత్నం, వెంకటేశులు, రమణ, వార్డు మెంబర్లతో కలసి 50 మందికి కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. అందరూ సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, శ్రీ రాములు, నాగరాజు రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సమావేశం



ప్రజాశక్తి కార్వేటినగరం : మండల యాదవ ఎంప్లాయి స్ సొసైటీ కార్యవర్గ సమావేశం కార్వేటినగరం శివాలయం వీధిలోని కాన గలమ్మ ఆలయ ఆవరణలో ఏపీఎస్ జిడి నెల్లూరు నియోజకవర్గ అధ్యక్షులు జోగి గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సమావేశంలో యాదవ్ సమాజ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు, ఉద్యోగులకు, చేయూత అందించాలని ఈ కార్యక్రమంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ కార్వేటినగరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా వి మోహన్ మురళి యాదవ్, అధ్యక్షులు గా ఎస్ వాసు యాదవ్, ప్రధాన కార్యదర్శి గా బీమా రావు యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా వేణుగోపాల్ యాదవ్, మహిళా అధ్యక్షురాలుగా బంగారమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జువ్వి మోహన్ మురళి యాదవ్, పాపయ్య యాదవ్, జోగి బాలాజీ యాదవ్, మేళం వెంకటకృష్ణ యాదవ్, జోగి గురుప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ ఆర్ అశోక్

ప్రజాశక్తి -పుంగనూరు: చంద్రగిరి మండలం విద్యానికేతన్‌లో చదువుతున్న జేమ్స్ (దళిత) విద్యార్థి పై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ ఆర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థిని కొట్టి నోట్లో మూత్రం పోసి కులం పేరుతో దూషించిన ఇలాంటి దుర్మార్గులను వెంట నే


మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్

అరెస్టు చెయ్యాలన్నారు. వారి పై ఎస్‌సి, ఎస్‌టి అట్రా సిటీ, హత్యాయత్నం కేసు నమోదు చెయ్యాలని కోరా రు. లేకుంటే జిల్లా వ్యాప్తం గా మాల మహానా డు ఆధ్వర్యం లో నిరసన చేపడు తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగ, భాస్కర్, ఏడురు శ్రీనివాసులు, ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్రజా సేవలో నగరపాలక సంస్థ

- పి .నరసింహ ప్రసాద్, కమిషనర్, నగరపాలక సంస్థ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వేసవిలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా నగరపాలక సంస్థ చలివేంద్రాలు, రైల్వే గేటు వద్ద నీడ కోసం గ్రీన్ మ్యాట్, మొబైల్ వాహనాల ద్వారా తాగునీటి సరఫరా చేయడంతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు బయటికి రావొద్దంటూ సూచనలు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి: తాగునీటి చలివేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?.

కమిషనర్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్, ఎంఎస్ఆర్, గాంధీ సర్కిల్, దర్గా సర్కిల్ వంటి ప్రాంతాల్లో 15 చలివేంద్రాలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేశాం. సచివాలయాల పరిధిలో సచివాలయాలను ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి: వేసవి నుండి ప్రజలను కాపాడేలా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కమిషనర్: మెసానికల్ క్రీడా మైదానం ఎదురుగా ఉన్న రైల్వే గేటుకు ఇరువైపులా రైల్వే గేటు పడినప్పుడు ఎండ వేడిని తగ్గించేందుకు గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశాం. చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లోని ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారి కోసం మొబైల్ వాహనాల ద్వారా చల్లటి తాగునీరు అందించేందుకు రెండు మొబైల్ వాహనాలు ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి: ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

కమిషనర్: ఇతర ప్రాంతాల నుండి చిత్తూరు నగరంలో కూలి పనుల కోసం వచ్చే భవన నిర్మాణ కార్మికులకు వడదెబ్బ వలన కలిగే నష్టాలను వివరిస్తున్నాము. వేడి ఎక్కువగా ఉన్న సమయాల్లో తాగునీరు, ఒఆర్ఎస్ తీసుకోవాలంటూ అవగాహన కల్పించాం.



ప్రజాశక్తి : నగరపాలక సంస్థ పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు?

కమిషనర్: నగరపాలక సంస్థ పరిధిలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. కట్టమంచి చెరువును అభివృద్ధి చేసేలా చెరువు ఉడికతీత పనులు చేపట్టాం.

ప్రజాశక్తి: హైరోడ్డు విస్తరణ పనులు ఎలా జరుగుతున్నాయి?

కమిషనర్: కట్టమంచి నుండి రెడ్డిగుంట వరకు హై రోడ్డు 100 అడుగుల విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవన యజమానులను ఒప్పించాం. టిడిఆర్‌సి బాండ్లు తీసుకునేందుకు భవన యజమానులను ఒప్పించడం జరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా ముందుగా ప్రభుత్వ భవనాలను తొలగిస్తున్నాం. బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండ్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడుతున్నాం. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో 500 మొక్కలు నాటారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

- తాగునీటి వసతి కల్పించాలి
- మానిటరింగ్ కమిటీ సమావేశంలో వినతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండల వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టిలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేసి ఆయా కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు హనుమంతు అధ్యక్షతన ఎస్సీ , ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎస్‌సి, ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా శ్మశాన వాటికలు, వాటికి దారులు, తాగునీటి సమస్యలపై అధికారులను పలువురు దళిత నాయకులు, ఎస్‌టి నాయకులు కోరారు. గత సమావేశంలో సమస్యలను దాదాపుగా పరిష్కరించామని ప్రస్తుతం తెలిపిన సమస్యలపై ఆయా గ్రామాల్లో వెళ్లి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీల మాధవి, వ్యవసాయ అధికారిణి జ్యోతి, ఎంఈఓ కేశవరెడ్డి , ఎస్ఐ నాగేశ్వరరావు, ఆయా శాఖలకు చెందిన అధికారులు మండ లం లోని ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాజంలో కలిసి రావాలి

డాక్టర్ విజయ్ కుమార్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: హెచ్ఐవి బాధితులు సమాజంలో కలిసి రావాలని విజయ్ కుమారి అన్నారు. ఆదివారం మండ ల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్యాండిల్ ర్యాలీ ఐ సిటిఎస్ కౌన్సిలర్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మే నెల అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహించడం ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి, సంఘీభావం చూపించడానికి, అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం గుర్తుంచుకుంటామని తెలిపారు. 'మాట్లాడుతాం.. నడిపిస్తాం...'అనే నినాదం తో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే



నిర్వహిస్తున్నామని ఎయిడ్స్ వ్యాధిపై పోరాడటానికి అంకిత భావంతో ఉన్నవారిని గౌరవించడానికి, హెచ్ఐవితో నివసించే ప్రజలతో సమాజం కలిసి రావడానికి, అవగాహన పెంచుకోవడానికి, సంఘీభావం చూపించడానికి ఇది సరైన సమయం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది రెడ్డి కుమారి, శశి, ద్రాక్షయిని, సెల్వి, దాసు, జ్యోతి బాబు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి- కార్వేటినగరం: వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. సేనాపతి ఉత్సవం చేపట్టారు. అనంతరం రాత్రి 7.15 నుంచి 8.30 గంటల వరకు మృత్సం గ్రహణం, పూజ, శాస్త్రోక్తంగా అంకురార్పణలతో సకల దేవతలకు అహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్కుమార్, షరాబ్ బాబుసురేష్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

స్వామికి సారె

ధ్వజారోహణకు కావాల్సిన గరుడపతాకం, కొడితాడు, గరుడ పటానికి కావాల్సిన వస్త్రాలు వంటి పూజా సామగ్రిని స్థానికులు సుబ్రహ్మణ్యయాదవ్ ఆనవాయితీ ప్రకారం మేళతాళాల నడుమ, అత్యంత వైభవంగా ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అధికారికి సమర్పించారు.

నేను ధ్వజారోహణం

సోమవారం ఉదయం 9.15 గంటల నుంచి 9.45 గంటల మధ్య మిథున లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 గంట నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ ఉంటుంది. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామి నగర వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు.

క్రైం న్యూస్


పోలీసుల అదుపులో నలుగురు దొంగలు

నలుగురు దొంగల అరెస్ట్

ప్రజాశక్తి- పూతలపట్టు: నలుగురు చోరీ దొంగలను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సిఐ కృష్ణమోహన్ కథనం మేరకు...ఈనెల 5వ తేదీ పూతలపట్టు మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న రెండు గృహాల్లో పెద్ద ఎత్తున చోరీ చోటుచేసుకుంది. ఇందులో 216 గ్రాముల బంగారం, 650 గ్రాములు వెండి చోరీకి గురైంది. ఈ క్రమంలో ఆదివారం పూతలపట్టు పోలీసులు రంగంపేట క్లాస్‌లో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు టిఎన్ 87 డి 3448 నెంబర్ గల కారులో వచ్చారు. పోలీసులు వీరి కారును ఆపి విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన స్థాయిలో విచారించగా అసలు విషయం బయటపడింది. రాజు, శ్రీకాంత్, మురుగన్, యువరాజులు చోరీలకి పాల్పడినట్లు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ కృష్ణమోహన్, సిబ్బందిని డిఎస్‌పి సాయి తేజ్ అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మృతుడి వయస్సు సుమారు 70 , 75 వుంటుందన్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటలకు చిత్తూరు– తిరుపతి రోడ్ పీహెచ్ వాడ వద్ద వున్న అపోలో ఫార్మసీ ఎదురుగా రైల్వే స్టేషన్ నుండి అపోలో ఫార్మసీ వైపునకు నడుచుకుని రోడ్డును దాటుతుండగా మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి ఢీ కొన్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి గురించి తెలిసిన వారు చిత్తూరు పోలీసులు 949107 4515 నెంబరుకు ఫోను చేయాలని పేర్కొన్నారు..


భూదాన విరాళం అందిస్తున్న బిఆర్‌డి మిత్ర మండలి

బిఆర్‌డి మిత్ర మండలి భూదానం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు అనుచరులు బి ఆర్ డి మిత్ర మండలి తిరుపతి గంగమ్మ దేవాలయ భూదానానికి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు ఆలయ కమిటీ అధ్యక్షులు బి ఎం కె రవిచంద్రబాబు కు విరాళ సొమ్ము 42,000 రూపాయలను బిఆర్ డి మిత్రమండలి అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఆలయ భూదానానికి 5.6 చదరపు అడుగుల భూమికి 42 వేల రూపాయలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అనుచరులు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ డి మిత్రమండలి బాలాజీ, సంతోష్, భాస్కర్, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్, స్థానిక టిడిపి నాయకులు మణిగోపాల్, జిమ్ దాము, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్

100 వాహనాలు సీజ్, రూ.1,03,500ల జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పోలీసులు సూచించారు. చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో ఆదివారం పట్టణంలోని అన్ని స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను ఆపి వాహనాలను సీజ్ చేసి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. ఈ డ్రైవ్‌లో డీఎస్పీ, పట్టణ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని వాహనం నడుపుతూ దొరికిన 100 మంది మైనర్ల తల్లిదండ్రులకు రూ.1,03,500ల జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ18 సంవత్సరాలు నిండకముందే ద్విచక్ర వాహనం, కారు నడిపించడం చాలా ప్రమాదకరమని, ఇది చట్ట వ్యతిరేకమని తెలిపారు. మొదటిసారి పట్టుబడిన వారికి జరిమానా విధించడం జరిగిందని, మరోమారు మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేసి జరిమానా విధించి తల్లిదండ్రుల లైసెన్సును సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు.

బంగారుపాళ్యం: మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాహనాల పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ఇటు వాహనదారులకు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఇద్దరికీ భారీ నష్టం జరుగుతుందన్నారు. అనంతరం మైనర్ల వాహన నడుపుతున్న వారిని ముగ్గురిని అదుపులో తీసుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్ పలువురు పోలీసులు పాల్గొన్నారు.


పలమనేరులో

పలమనేరు: ఈ మధ్యకాలంలో మైనర్లు సరైన మెలకువలు లేకుండా వాహనాలు నడిపి పలు ప్రమా దాలకు కారణ మవు తు న్నారని వారికి వాహనాలు ఇవ్వొద్దని పలమనేరు పట్టణ సిఐ నరసింహరాజు పేర్కొన్నారు. ఆదివారం నేడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు మైనర్లను అదుపులోకి తీసుకొని వారి వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి వారి వివరాలు నమోదు చేశామన్నారు. అంతేగా ఉన్న వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఇదే మాదిరి మైనర్లు వాహనాలతో రోడ్లపై తిరిగితే వారి తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేస్తామని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

లబ్ధిదారులకు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని మదరంపల్లి పంచాయతీలో లబ్ధిదారులకు ఆదివారం ఇంటి పట్టాల పంపిణీ నిర్వహిం చారు. పంచాయతీ ప్రజలు నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 47 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అంచెలంచెలుగా అమలు చేస్తూ, మరోవైపు రాష్ట్ర అభివృద్ధిని ముఖ్యంగా రాజధాని నిర్మాణం చేపడుతోందన్నారు. 2022లో టిడిపి మహానాడు కు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన సి కృష్ణమూర్తి మృతి చెందాడని, అతని కుటుంబానికి సీఎం సహాయ నిధి రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎన్ రెడ్డప్ప, మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, వేమారెడ్డి, నాగరాజు రెడ్డి, జయరాం రెడ్డి, స్థానిక తహశీల్దారు అనిల్ కుమార్, మండల స్థాయి అధికారులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పార్టీని బలోపేతం చేయాలి

- జనసేన కార్యకర్తలకు మంత్రి నాదెండ్ల సూచన

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని, అధిష్టానం నుంచి కూడా మరింత సహకారమందిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంత్రి తెనాలి పర్యటన సందర్భంగా పుంగనూరు జనసేన నాయకులు వేణు గోపాల్ రెడ్డి మంత్రిని మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. పుంగనూరు నియోజకవర్గంలో పార్టీ పూర్తి స్థాయిలో బలోపేతం గురించి చర్చించి గ్రామాల్లో ఉన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ కూడా పుంగనూరు నియోజకవర్గం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించాలని తెలిపారు. ఇందుకు పార్టీ మరింత సహకారం అందిస్తుందన్నారు. త్వరలో పుంగనూరు పర్యటనకు వస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే లా జనసేన నాయకు లందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ సభ్యులు చైతన్య రాయల్, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు విరూపాక్షి, పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్, సోమల మండల అధ్యక్షుడు నాగ భూషణ్, హరి నారాయణ, రఘు, పాముల హరి, చిన్నా, జావెద్, మండల ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం లు పాల్గొన్నారు.


జనసేన కార్యకర్తలకు సూచనలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్